అత్యల్ప స్థాయికి చేరిన ఉష్ణోగ్రతలు

రంగారెడ్డి అర్బన్, జనవరి 2 : ఉమ్మడి జిల్లాలో ఉష్ణోగ్రతలు అత్యల్పస్థాయికి చేరుకున్నాయి. ఉదయం 8.30 గంటల వరకు ఇదే పరిస్థితి ఉంటుంది. మంగళవారం పొగమంచు పొలాలు, రోడ్లను కప్పేసింది. రోడ్లను పూర్తిగా మంచు కప్పేయడంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మంగళవారం రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలం తాళ్లపల్లిలో 10.7 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. వికారాబాద్ జిల్లా మర్పల్లిలో 11.6 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదు కాగా మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా మౌలాలిలో 12.2 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదైంది.



శంషాబాద్‌లో పెట్రోల్ బంక్‌లో భారీగా నిలిచిన వాహనాలు

పెట్రోల్ కష్టాలు

మోటారు వాహనాల చట్ట సవరణను నిరసిస్తూ తెలంగాణలో పెట్రోల్, ఆయిల్ ట్యాంకర్ల యజమానులు మంగళవారం ధర్నాకు దిగడంతో పలు పెట్రోల్ బంకుల వద్ద నో స్టాక్ బోర్డులు దర్శనమిచ్చాయి. దీంతో రంగారెడ్డి జిల్లాలోని పెట్రోల్ పంపులు వాహనదారులతో కిటకిటలాడాయి. జిల్లా కేంద్రం నుంచి గ్రామీణ ప్రాంతాల్లోని పెట్రోల్ బంకుల వరకు ఇదే పరిస్థితి నెలకొంది. పెట్రోల్ ట్యాంకర్ల యజమానులు తమ డిమాండ్ల పరిష్కారం కోసం బుధ, గురువారాల్లో సమ్మె చేయాలని నిర్ణయించినట్లు మంగళవారం మధ్యాహ్నం సోషల్ మీడియాలో వైరల్ కావడంతో వాహనదారులు ముందు జాగ్రత్తగా పెట్రోల్ కోసం బంకుల్లో బారులు తీరారు. క్యూలైన్లు రోడ్లపైకి రావడంతో పలుచోట్ల ట్రాఫిక్ స్తంభించింది.

- మరిన్ని వివరాలు7లో..



ఇబ్రహీంపట్నం హెచ్‌పీ బంకు వద్ద వాహనాల బారులు



శంకర్‌పల్లిలో పెట్రోల్ లేకపోవడంతో మూతపడిన బంకు

చలికి కోడిగుడ్ల ఉత్పత్తి తగ్గింది. దీనికి తోడు దాణా ధరలు విపరీతంగా పెరిగాయి. అంతో ఇంతో ఉత్పత్తి అయిన గుడ్లలో ఎక్కువ శాతం ఇతర రాష్ట్రాలకు ఎగుమతి అవుతున్నాయి. దీంతో కోడిగుడ్డు ధర ఆకాశన్నంటింది. సామాన్యులు గుడ్డు కూరకు దూరమయ్యారు. వాడకం పెరగడం.. ఉత్పత్తి తగ్గడం కూడా ధరల పెరుగుదలకు కారణమైంది.



కొండెక్కిన కోడిగుడ్డు

రోజు రోజుకూ పెరుగుతున్న గుడ్డు ధర

- రిటైల్ మార్కెట్‌లో రూ. 7 పలుకుతున్న ధర
- తగ్గిన ఉత్పత్తి, పెరిగిన దాణా ధరలు
- ఇతర రాష్ట్రాలకు ఎగుమతీ మరో కారణం

ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి అర్బన్, జనవరి 2 : కోడిగుడ్డు ధర కొండెక్కి కూర్చుంది. కార్తీకమాసం ముగియడంతో గుడ్ల వినియోగం పెరిగింది. గతంలో కరోనా సమయంలో కోడిగుడ్ల వినియోగం పెరిగింది. ఇప్పుడు మళ్లీ కరోనా కేసులు పెరుగుతుండటంతో గుడ్లు తినే వారి సంఖ్య పెరిగింది. దీంతో వినియోగం పెరిగింది. వీటితో పాటు కోళ్ల దాణా ధరలు రెట్టింపు అవ్వడం కూడా ధరలు పెరగడానికి కారణమని వ్యాపారులు చెబుతున్నారు. గతంలో కిలో రూ. 15 నుంచి రూ.17 వరకు ఉన్న కోళ్ల దాణా ధర ప్రస్తుతం ఏకంగా ఒకేసారి రూ.28కి పెరిగింది. గుడ్డుకు రూ.5.25 ధర పలికితే తమకు గిట్టుబాటు అయ్యేదని.. ప్రస్తుతం దాణా ధర పెరగడం, డిమాండ్ తగ్గట్లు గుడ్ల ఉత్పత్తి లేకపోవడంతో ధర పెంచక తప్పడం లేదని పౌల్ట్రీఫాం నిర్వహకులు చెబుతున్నారు. ఇక కోడిగుడ్ల ధర పెరగడానికి రవాణా భారమవడం కూడా ఒక కారణంగా చెబుతున్నారు. రంగారెడ్డి, షాద్‌నగర్, మహబూబ్‌నగర్ నుంచి తెలంగాణలోని కొన్ని జిల్లాకు కోడి గుడ్లను దిగుమతి చేసుకుంటున్నారు. రవాణా ఖర్చులు పెరగడంతో కోడిగుడ్డును రూ.7 విక్రయిస్తే లాభమనే భావనను వ్యాపారులు వ్యక్తం చేస్తున్నారు. దేశ వ్యాప్తంగా తెలంగాణలో కోడిగుడ్ల ఉత్పత్తి ఎక్కువ. తెలంగాణలో ఉత్పత్తి అవుతున్న గుడ్లలో 50 శాతం ఢిల్లీ, ముంబై, నగరాలతో పాటు ఉత్తరప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాలకు ఎగుమతి అవుతున్నాయి. ఇక్కడ అమ్మే ధర కంటే.. బయటి రాష్ట్రాల్లో కోడిగుడ్డుపై 65 పైసలు అదనంగా వస్తుండటంతో ఇక్కడ నుంచి కోడిగుడ్లను ఎగుమతి చేస్తున్నారు. చలి కాలంలో చలి తీవ్రతకు కోళ్లు ఎక్కువగా చనిపోతున్నట్లు ఫాం నిర్వహకులు చెబుతున్నారు. సీజనల్ వ్యాధులు కూడా సోకడంతో గుడ్ల ఉత్పత్తి తగ్గుతుందంటున్నారు. 15 రోజుల కిందట ఆరు రూపాయలు ఉన్న గుడ్డు ధర నేడు 7 రూపాయలకు చేరుకుంది. ప్రస్తుతం పౌల్ట్రీఫాంలో ఒక కోడిగుడ్డు 5.82 రూపాయలు లభించగా హోల్‌సేల్‌కు వచ్చేసరికి 6.02 రూపాయలు పలుకుతుంది. రిటైల్ మార్కెట్‌లో ఏడు రూపాయలకు విక్రయిస్తున్నారు.

కోడిగుడ్డు ధరలు (రూపాయల్లో)

తేదీ	పౌల్ట్రీఫాంలో	హోల్‌సేల్	రిటైల్
డిసెంబరు 28	5.90	6.10	7.00
డిసెంబరు 29	5.70	5.90	7.00
డిసెంబరు 30	5.73	5.93	7.00
డిసెంబరు 31	5.76	5.96	7.00
జనవరి 01	5.79	5.99	7.00
జనవరి 02	5.82	6.02	7.00

'మధ్యాహ్నం'లో కనిపించని గుడ్డు

పాఠశాలల్లో విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనంలో గుడ్డు కనిపించడం లేదు. విద్యార్థులకు వారానికి మూడుసార్లు ఇవ్వాల్సిన గుడ్డును చాలాచోట్ల మానేశారు.

15 రోజుల నుంచి ధర పెరుగుతుంది



15 రోజులుగా గుడ్ల ధర పెరుగుతూనే ఉంది. 15 రోజుల క్రితం రూ.5ఉన్న గుడ్డు ధర ప్రస్తుతం హోల్‌సేల్‌లో రూ.6.02కు అమ్ముతున్నాము. తెలంగాణలో ఉత్పత్తి అయ్యే గుడ్లు రాజస్థాన్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలకు ఎగుమతి అవుతున్నాయి. అక్కడ ఒక గుడ్డుపై 65 పైసలు ఎక్కువగా రావడంతో వ్యాపారులు ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేస్తున్నారు. దీంతో స్థానికంగా గుడ్ల కొరత ఏర్పడి ధరలు పెరుగుతున్నాయి.

- సిరాజ్, హోల్‌సేల్ గుడ్ల వ్యాపారి, చేవెళ్ల

గిట్టుబాటు కావడం లేదు



15 రోజులుగా గుడ్డు ధర మార్కెట్‌లో రూ.7 ఉంది. ప్రభుత్వం గుడ్డుకు రూ.5 మాత్రమే చెల్లిస్తుంది. దీంతో ఒక గుడ్డుకు రెండు రూపాయలు నష్టపోతున్నాం. విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉంటే.. నష్టం ఎక్కువగా వస్తుంది. ప్రభుత్వం గుడ్లను సరఫరా చేయాలి. లేదా గుడ్డుకు ఏడు రూపాయలకు పెంచాలి.

- స్వాతి, మధ్యాహ్నభోజన నిర్వాహకురాలు, చౌదరిగూడ

సబ్సిడీపై గుడ్లు అందించాలి



మటన్, చికెన్ తినలేని పేదలు కనీసం గుడ్లను తిందామనుకుంటే.. అవి కూడా దూరమవుతున్నాయి. గుడ్లలో పోషక విలువలు ఎక్కువగా ఉంటాయని, గుడ్లను తినాలని డాక్టర్లు చెబుతున్నారు. కానీ.. పేదలకు గుడ్లు అందుబాటులో ఉండటం లేదు. ప్రభుత్వం సబ్సిడీపై గుడ్లను సరఫరా చేయాలి.

- చోటేమియా, చౌదరిగూడ

ఫార్మాసిటీ రద్దు ప్రకటనతో రైతుల్లో అయోమయం

యాచారం, జనవరి 2 : ఫార్మాసిటీ రద్దు చేయడం లేదని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన ప్రకటనతో రైతుల్లో అయోమయం నెలకొంది. మంగళవారం పలు పత్రికలు, ప్రసార మాధ్యమాల్లో కథనాలను చూసిన రైతులు మళ్లీ ఫార్మాసిటీ వస్తుందా అని యాచారం మండలంలోని మేడిపల్లి, తాడిపర్తి, నానక్‌నగర్, కుర్మిద్ద గ్రామాలకు చెందిన రైతులు అయోమయంలో ఉన్నారు. అధికారంలోకి రాగానే ఫార్మాసిటీని రద్దు చేస్తున్నట్లు ప్రకటించిన ప్రభుత్వం.. ఇప్పుడు రద్దు చేయడం లేదని చెప్పడం విడ్డూరంగా ఉందని రైతులు మండిపడుతున్నారు. ఫార్మాసిటీ ఏర్పాటుకు తాము సుముఖమని ఎన్నికల ముందు ఎందుకు చెప్పలేదని రైతులు ప్రశ్నించారు. ఫార్మాసిటీ కోసం మళ్లీ భూములు తీసుకుంటారా అని రైతులు భయాందోళన చెందుతున్నారు. ఇప్పటికే ఫార్మాసిటీకి భూములు ఇచ్చేది లేదని కుర్మిద్ద, తాడిపర్తి తదితర గ్రామాలకు చెందిన రైతులు రాష్ట్ర హైకోర్టులో కేసులు వేశారు. 3వేల ఎకరాల భూములకు సంబంధించి కోర్టుల్లో కేసులున్నాయి. ఫార్మాసిటీ రద్దు చేయడం లేదని సీఎం ప్రకటనపై సీపీఎం, బీజేపీ నాయకులు కూడా మండిపడుతున్నారు. ఫార్మాసిటీని యాచారం మండలంలో కాకుండా ఇతర ప్రాంతాలకు తరలించాలని ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. అయితే, ఈ విషయంపై కిసాన్ కాంగ్రెస్ జాతీయ ఉపాధ్యక్షుడు ఎం.కోదండరెడ్డి స్థానిక విలేకరులతో మాట్లాడుతూ సీఎం రేంవత్‌రెడ్డికి ఫార్మాసిటీపై పూర్తి అవగాహన ఉందన్నారు. ఇప్పటికే సీఎంతో ఈ విషయమై చర్చించామని, బుధవారం పరిశ్రమల శాఖ మంత్రితో మాట్లాడతామన్నారు. ఆ తర్వాత మరోమారు సీఎంతో భేటీఅయి పూర్తి వివరాలు మీడియాకు వెల్లడిస్తానని ఆయన తెలిపారు.

ఫార్మాసిటీ తేకండి



యాచారం మండలంలో ఫార్మాసిటీ ఏర్పాటు చేయకండి. కాంగ్రెస్ నాయకులు ఫార్మాసిటీ ఏర్పాటు చేయడం లేదని చెప్పడంతోనే మేమంతా కాంగ్రెస్‌కు ఓటు వేశాం. ఇంకేమైనా కంపెనీలు పెడితే అభ్యంతరం లేదు. వాతావరణం పాడుచేసే కంపెనీలు వద్దు. ఇప్పటి వరకు తీసుకున్న భూములు చాలు. మళ్లీ ఫార్మాసిటీ కోసం భూములు తీసుకోవద్దని కోరుతున్నా.

- జగన్‌నాయక్, రైతు, కుర్మిద్ద తండా

సదరం క్యాంపు జనవరి నెల ఆన్‌లైన్ స్లాట్స్ విడుదల

5, 19 తేదీల్లో వనస్థలిపురం ఏరియా ఆసుపత్రిలో..

- 9, 23, 30 తేదీల్లో కొండాపూర్ జిల్లా ఆసుపత్రిలో సదరం క్యాంపు
- క్యాంపునకు హాజరయ్యే దివ్యాంగులు మీ సేవలో స్లాట్ బుకింగ్ చేసుకోవాలి
- దరఖాస్తుదారులు డాక్టర్ రిపోర్టు, ఆధార్‌కార్డు, రేషన్ కార్డు, ఫొటో తేవాలి
- జిల్లా పూర్తిస్థాయి ఇన్‌చార్జ్ కలెక్టర్ గౌతమ్



రంగారెడ్డి అర్బన్, జనవరి 2 : జనవరి నెలకు సంబంధించి సదరం క్యాంపు ఆన్‌లైన్ స్లాట్స్‌ను జిల్లా కలెక్టర్ విడుదల చేసినట్లు జిల్లా పూర్తి స్థాయి ఇన్‌చార్జ్ కలెక్టర్ గౌతమ్ పోట్రు తెలిపారు. వికలాంగులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా సదరం క్యాంపులు నిర్వహించాలని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి ప్రభాకర్‌ను ఆదేశించారు. సదరం క్యాంపునకు హాజరు కావాలనకునే వారు మీసేవలో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. కొండాపూర్ జిల్లా ఆసుపత్రి, వనస్థలిపురం ఏరియా ఆసుపత్రిలో సదరం క్యాంపు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ నెల 9, 23, 30 తేదీల్లో కొండాపూర్ జిల్లా ఆసుపత్రిలో సదరం క్యాంపు నిర్వహించడం జరుగుతుందని, అలాగే ఈ నెల 5,19 తేదీల్లో రెండు రోజుల పాటు వనస్థలిపురం ఏరియా ఆసుపత్రిలో సదరం క్యాంపు ఉంటుందని ఆయన తెలిపారు. క్యాంపునకు వచ్చే దివ్యాంగులు తప్పనిసరిగా మీ సేవలో స్లాట్ బుక్ చేసుకుని, రశీదులో సూచించిన సమయానికి ఆసుపత్రికి చేరుకోవాలన్నారు. దరఖాస్తుదారులు డాక్టర్ రిపోర్టుతో పాటు ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, ఫొటో తీసుకుని రావాలని చెప్పారు. మీసేవ స్లాట్ బుకింగ్‌లో డీఆర్‌డీఏ ప్రమేయం ఉండదని, స్లాట్స్ దొరకని దరఖాస్తుదారులకు వచ్చేవచ్చే నెల మొదటి వారంలో స్లాట్స్ మీ సేవలో అందుబాటులో ఉంటాయని జిల్లా పూర్తిస్థాయి ఇంచార్జ్ కలెక్టర్ గౌతమ్ పోట్రు చెప్పారు.

భూగర్భ వంతెనల నిర్మాణానికి జాతీయ రహదారిని పరిశీలించిన ఎంపీ లక్ష్మణ్


ఎన్టీపీసీ చౌరస్తావద్ద పరిశీలిస్తున్న ఎంపీ లక్ష్మణ్, నాయకులు

ఘట్‌కేసర్, జనవరి 2: మండల పరిధి హైదరాబాద్-వరంగల్ జాతీయ రహదారిపై అన్నోజిగూడలో ఎన్టీపీసీ చౌరస్తా,ఘట్‌కేసర్‌లోని యంనంపేట్ చౌరస్తా,మైసమ్మగుట్ట కాలనీకి వెళ్లేందుకు భూగర్భ వంతెనల నిర్మాణం చేపట్టి ప్రజలకు ఇబ్బందులు తీర్చేందుకు చర్యలు చేపట్టాలని జాతీయ రహదారుల అధికారులను ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్ సూచించారు. మంగళవారం ఎన్టీపీసీ చౌరస్తా, యంనంపేట్ చౌరస్తా, అవుషాపూర్‌లో, మైసమ్మగుట్టకు రోడ్లను పరిశీలించారు. ఇటీవల ఘట్‌కేసర్ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి ఢిల్లీలో లక్ష్మణ్‌ను కలిసి భూగర్భ వంతెనలు లేక ప్రజలు తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారని వివరించారు. దీంతో ఎంపీ సమస్యలను కేంద్ర రహదారుల మంత్రి నితిన్‌గడ్కరీకి వివరించాడు. దీంతో ఆయన అధికారులతో మండల పరిధిలోని పలుచోట్ల జాతీయ రహదారిని దాటేందుకు ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్న చౌరస్తాలను పరిశీలించారు. యంనంపేట్ చౌరస్తా వద్ద ప్రజలు రోజూ పడుతున్న అవస్థలను చూసిన ఎంపీ వాటిని నివారించేందుకు వెంటనే చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఏమైనా ఇబ్బందులు ఎదురైతే తన దృష్టికి తెస్తే వాటిపై తాను కేంద్ర మంత్రితో మాట్లాడి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పోచారం మున్సిపల్ చైర్మన్ బోయపల్లి కొండల్‌రెడ్డి, వైస్ చైర్మన్ రెడ్డియా, కౌన్సిలర్లు మహేష్, సాయిరెడ్డి, నాయకులు బిక్కూ నాయక్, విక్రంరెడ్డి, లక్ష్మారెడ్డి, హనుమాన్, శంకర్‌రెడ్డి, శేఖర్, రాజేశ్వర్‌రెడ్డి, అచ్చిని నర్సింహ, రాజారమేష్ తదితరులు పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డి విజయంలో ... మాజీ ఎమ్మెల్యే క్రియాశీల పాత్ర

కొడంగల్, జనవరి 2: ఎమ్మెల్యేగా రేవంత్‌రెడ్డి గెలుపు కోసం కొడంగల్ మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డి, కుటుంబ సభ్యులు క్రియాశీలక పాత్ర పోషించడం హర్షణీయమని, కాంగ్రెస్ నాయకులు, వ్యాపరవేత్త శ్రీరాంరెడ్డి అన్నారు. మంగళవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురునాథ్‌రెడ్డిని పలువురు నాయకులు శాలువాలతో సన్మానించారు. శ్రీరాంరెడ్డి మాట్లాడుతూ.. ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెల్చిన గుర్నాథరెడ్డి వయస్సు పైబడినా రేవంత్‌రెడ్డి గెలుపు కోసం కృషిచేయడం గొప్ప విషయం అన్నారు. అందరి కృషితో రేవంత్‌రెడ్డి ఎమ్మెల్యేగా గెల్చి సీఎం కావడం ఈ ప్రాంత ప్రజల అదృష్టం అన్నారు. సీఎం కొడంగల్ ప్రాంతం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో పీసీసీ ప్రతినిధి ఎండీ.యూసుఫ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రశాంత్, ఎండీ.ముస్తాక్, జయతీర్థ చారి, కె.మొగులయ్య పాల్గొన్నారు.


మాజీఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డిని సన్మానిస్తున్న శ్రీరాంరెడ్డి

శిక్షణను కార్మికులు సద్వినియోగం చేసుకోవాలి

పరిగి, జనవరి 2: భవన నిర్మాణ రంగ కార్మికులు శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని జన్‌సహాస్ సంస్థ జిల్లా కో-ఆర్డినేటర్ ఎం.ప్రకాశ్ అన్నారు. మంగళవారం పరిగి మండల పరిషత్‌లో జన్‌సహాస్, న్యాక్, అంకిత్ సంస్థల ఆధ్వర్యంలో శిక్షణ తరగతులను ప్రారంభించారు. కార్మికులకు ట్రైనింగ్ కిట్స్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లేబర్ కార్డులు కలిగిన కార్మికులు శిక్షణ పొందడం ద్వారా పనుల్లో నైపుణ్యాన్ని పెంపొందించుకోవచ్చన్నారు. శిక్షణ కాలంలో కార్మికులకు రోజుకు రూ.300 నగదు, భోజన వసతి కల్పిస్తున్నట్లు తెలిపారు. శిక్షణ పూర్తయిన తర్వాత న్యాక్ నుంచి సర్టిఫికెట్ అందజేస్తామన్నారు. భవన నిర్మాణ రంగంలో పనిచేస్తున్న ప్రతి కార్మికుడు లేబర్ కార్డును పొందాలని, తద్వారా బీమాతోపాటు, ప్రభుత్వం కల్పించే ఇతర సంక్షేమ పథకాలను పొందే వీలుంటుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ట్రైనీ ఇన్‌చార్జి ప్రసాద్, న్యాక్ ప్రతినిధులు రాజయ్య పాల్గొన్నారు.

దీపాదాస్ మున్షీకి ఘనస్వాగతం

» ఎయిర్‌పోర్టులో స్వాగతం పలికిన కాంగ్రెస్ నాయకులు

శంషాబాద్ రూరల్, జనవరి 2(ఆంధ్రజ్యోతి) : ఢిల్లీ నుంచి హైదరాబాద్‌కు చేరుకున్న కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీకి మంగళవారం శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్‌కుమార్ గౌడ్, మాజీ ఎంపీ వి.హనుమంతరావు, ఏఐసీసీ కార్యదర్శి చిన్నారెడ్డి, చైర్మన్ వేణుగోపాల్, డీసీసీ అధ్యక్షుడు రోహన్‌రెడ్డి తదితరులు ఘన స్వాగతం పలికారు. అంతకుముందు విమానాశ్రయంలోని వీఐపీ లాంజ్‌లో ఆమె కాంగ్రెస్ నేతలతో మాట్లాడారు. రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వ పాలనపై ఆరా తీసినట్లు సమాచారం. అనంతరం ప్రత్యేక కాన్వాయ్‌లో నగరానికి బయలుదేరి వెళ్లారు.

రేషన్ ఈ-కేవైసీకీ నెలాఖరు గడువు

» జిల్లాలో 75శాతం పూర్తి


రేషన్ దుకాణంలో వేలిముద్రలు తీసుకుంటున్న డీలరు

మేడ్చల్ జనవరి 2(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఆహార భద్రత కార్డు(తెల్ల రేషన్ కార్డు)లో సభ్యులకు ఈ-కేవైసీ ప్రక్రియ కొనసాగుతోంది. ఈ నెలాఖరు వరకు గడువు విధించారు. ఈ మేరకు పౌరసరఫరాల శాఖ కమిషనర్ దేవేంద్ర సింగ్ చవాన్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ప్రక్రియ జిల్లాలో 75శాతం ప్రక్రియ పూర్తయింది. ఆహార భద్రత కార్డులో పేరున్నవారంతా ఈకేవైసీ చేసుకోవాలి. రేషన్ దుకాణాల్లో బయోమెట్రిక్‌తో పునరుద్ధరించుకోవాలి. వాస్తవానికి లబ్ధిదారులు ఉన్నారో లేదో అని తెలుసుకునేందుకు దీనిని ప్రవేశపెట్టారు. గత సెప్టెంబరులో ప్రక్రియ ప్రారంభమైంది. ఈ-కేవైసీ చేసుకోకుంటే బియ్యం రావనే వదంతులతో రేషన్ దుకాణానికి పరుగులు తీశారు. డీలర్లు బయోమెట్రిక్ ద్వారా ఈకేవైసీ చేశారు. జిల్లాలో 5,06,364 ఆహారభద్రత కార్డులు, 17,20,035 మంది సభ్యులుండగా 75శాతం మంది వేలిముద్రలు తీసుకున్నారు. నెల రోజుల సమయం ఉన్నందున ఎవరూ ఆందోళన చెందాల్సిన పని లేదు. ఈ నెల కోటా మొదటి వారంలో పంపిణీ చేస్తారు.


మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్

మిల్లింగ్ చేసి ఎఫ్‌సీఐకి అప్పగించడంలో ఆలస్యం చేయొద్దు

వికారాబాద్, జనవరి 2 : సేకరించిన వరి ధాన్యాన్ని మిల్లింగ్ చేసి వెంటనే ఎఫ్‌సీఐకి తరలించాలని అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో సీఎంఆర్‌పై రైస్ మిల్లర్లతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. రైస్ మిల్లర్ల వద్ద ఉన్న మిగులు బియ్యాన్ని వెంటనే ఎఫ్‌సీఐకి అప్పగించాలని సూచించారు. మిల్లర్లు తమ మిల్లు సామర్థ్యం ప్రకారం మిల్లింగ్ చేసి సీఎంఆర్‌కు ఇవ్వాలన్నారు. కొనుగోలు కేంద్రాల నుంచి వచ్చిన ధాన్యాన్ని రైస్ మిల్లర్లు అన్‌లోడ్ చేసుకొని ధ్రువీకరించుకోవాలని స్పష్టం చేశారు. సమావేశంలో జిల్లా పౌరసరఫరాల అధికారి రాజేశ్వర్, రైస్ మిల్లర్లు పాల్గొన్నారు.


డైరీని ఆవిష్కరిస్తున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్

డైరీ ఆవిష్కరించిన స్పీకర్


వికారాబాద్, జనవరి 2 : నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని ఎస్‌టీయూ-టీఎస్ 2024 డైరీని శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ ఆవిష్కరించారు. మంగళవారం వికారాబాద్‌లో ఎస్‌టీయూటీఎస్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వేణుగోపాల్, షఫీల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మునిసిపల్ చైర్‌పర్సన్ మంజులతో కలిసి డైరీని ఆవిష్కరించారు. అంతకు ముందు సంఘం బాధ్యులు స్పీకర్‌ను పుష్పగుచ్ఛం, శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఎస్‌టీయూ జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు పి.శ్రీనివాసరావు, రాష్ట్ర కౌన్సిలర్ పవన్‌కుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు కనకాచారి, బాధ్యులు ఆశప్ప, చంద్రకాంత్, తిరుమలేష్ పాల్గొన్నారు.

అనుమతి లేని రైస్ మిల్లు సీజ్


అతికించిన నోటీసు

తాండూరు రూరల్, జనవరి 2: అంతారంలో సర్వే నంబర్-101/2లో సంతోష్‌కుమార్ గౌడ్ అనే వ్యక్తి పంచాయతీ అనుమతి లేకుండా రైస్‌మిల్లు నిర్మించాడు. ఉన్నతాధికారుల ఆదేశాలతో ఆ మిల్లును పంచాయతీ కార్యదర్శి ఇస్మాయిల్ మంగళవారం సీజ్ చేశారు. అంతారంలో అక్రమంగా రైస్ మిల్లు నిర్మించారు. అనుమతి తీసుకోవాలని సంతోష్‌కుమార్ గౌడ్‌కు నోటీసులు జారీ చేసినా స్పందించలేదు. అక్రమ నిర్మాణం చేపట్టినందుకు గాను రైస్ మిల్లు వద్ద నోటీసు అతికించి సీజ్ చేసినట్లు కార్యదర్శి తెలిపారు. వారం రోజుల్లో అక్రమ నిర్మాణాన్ని తొలగించకుంటే పంచాయతీ ఆధ్వర్యంలో కూల్చివేస్తామని నోటీసులో పేర్కొన్నట్లు పంచాయతీ కార్యదర్శి తెలిపారు.

బిల్లులు చెల్లించడంలేదని ధర్నా


ఎదులాబాద్ పంచాయతీ వద్ద ధర్నా చేస్తున్న బండి హనుమంతు-కృష్ణలీల దంపతులు

ఘట్‌కేసర్ రూరల్, జనవరి 2: తాను పంచాయతీకి సరఫరా చేసిన సామగ్రికి బిల్లులు చెల్లించడం లేదని కాంట్రాక్టర్ పంచాయతీ కార్యాలయం వద్ద ధర్నాకు దిగారు. ఎదులాబాద్ పంచాయతీకి బ్లీచింగ్ పౌడర్, చీపుర్లు సరఫరా చేసిన బండి హనుమంతు, అతడి భార్య కృష్ణలీలతో కలిసి మంగళవారం ధర్నా చేశారు. తాను 2021 నుంచి 2023 వరకు పంచాయతీకి చీపుర్లు, బ్లీచింగ్ సరఫరా చేశానని, దీనికి తనకు రూ.318,300 బిల్లులు రావాలన్నారు. బిల్లుల కోసం తిరిగి తిరిగి అలసిపోయి ధర్నాకు చేస్తున్నట్లు హనుమంతు తెలిపారు. అప్పులు చేసి పంచాయతీకి చీపుర్లు, బ్లీచింగ్ సరఫరా చేశానన్నారు. బిల్లు ఇవ్వకుంటే తాము ఆత్మహత్య చేసుకునే పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి తనకు బిల్లులు ఇవ్వాలని హనుమంతు దంపతులు కోరారు.

'మహబూబ్‌నగర్ పార్లమెంట్' బరిలో వంశీ

» అభ్యర్థిత్వంపై ధీమా.. పోటీకి వ్యూహాలు సిద్ధం!

» జడ్చర్ల నియోజకవర్గ పర్యటనే కారణమంటున్న నాయకులు



ఆమనగల్లు, జనవరి 2: ఏఐసీసీ కార్యదర్శి, కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే చల్లా వంశీచంద్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీ తరఫున మహబూబ్‌నగర్ పార్లమెంట్ స్థానానికి పోటీకి సిద్ధమవుతున్నారు. గత ఎన్నికల్లో మహబూబ్‌నగర్ పార్లమెంట్ నుంచి కాంగ్రెస్ తరఫున వంశీచంద్ రెడ్డి పోటీ చేశారు. కాంగ్రెస్ అభ్యర్థిత్వంపై ఇప్పటికే భరోసాగా ఉన్న వంశీ.. పోటీకి తగిన వ్యూహాలు సిద్ధం చేసుకుంటున్నట్లు సమాచారం. మంగళవారం జడ్చర్ల నియోజకవర్గంలో అధికార పార్టీకి చెందిన స్థానిక ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డితో కలిసి విస్తృతంగా పర్యటించి పలు కార్యక్రమాల్లో పాల్గొనడం అందుకు బలం చేకూరుస్తుంది. పాలమూరు పార్లమెంట్ బరిలో నిలువనున్నట్లు తన అనుచరులతో కూడా వంశీ పేర్కొన్నట్లు తెలిసింది. అసెంబ్లీ ఎన్నికల్లో మహబూబ్ నగర్ పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ స్థానాలకు గాను.. అన్నిటిని కాంగ్రెస్ కైవసం చేసుకుంది. ఈ నేపథ్యంలో పార్లమెంట్ స్థానాన్ని సునాయాసంగా దక్కించుకోవచ్చన్న భావనలో వంశీ ఉన్నట్లు రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. మహబూబ్ నగర్ పార్లమెంట్ ఇన్‌చార్జిగా సీఎం రేవంత్‌రెడ్డి ఉండడంతో కాంగ్రెస్ శ్రేణులు ఎన్నికలను అప్పుడే అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటున్నారు. ఏఐసీసీలో వంశీచంద్ రెడ్డి కీలక పదవిలో ఉండడం, అసెంబ్లీ ఎన్నికల్లో కల్వకుర్తి స్థానాన్ని కసిరెడ్డి నారాయణ రెడ్డికి త్యాగంచేసి ఆయన విజయానికి కృషిచేయడం వంటి అంశాలు పార్టీపరంగా ఆయనకు కలిసొచ్చే అంశాలు. తాను పోటీ చేయాలని నిర్ణయించుకుంటే అభ్యర్థిత్వం ఆయనకే లభిస్తుందని పార్టీ నేతలు భావిస్తున్నారు. గత కొంతకాలంగా మహబూబ్‌నగర్ పార్లమెంట్ కాంగ్రెస్ నేతలు, ఎమ్మెల్యేలతో వంశీచంద్‌రెడ్డి టచ్‌లో ఉంటూ వస్తున్నట్లు సమాచారం. మూడు రోజుల క్రితం రేవంత్ రెడ్డితో హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో వంశీ భేటీ అయ్యారు. ఎంపీ అభ్యర్థిగా బరిలో నిలిచే విషయమే ప్రధానంగా చర్చించినట్లు సమాచారం. మహబూబ్‌నగర్ పార్లమెంట్ అభ్యర్థిగా వంశీ పేరు దాదాపు ఖరారైనట్లేనని కల్వకుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ నేతలు పేర్కొంటున్నారు. సోనియా, రాహుల్, ఖర్గేలతో కూడా వంశీకి మంచి సంబంధాలున్నాయి. తెలంగాణలో సౌమ్యుడిగా వంశీకి మంచి పేరుంది. యువకుడైన వంశీనే బరిలో నిలిపితే బాగుంటుందని పార్టీ అగ్రనేతలు కూడా సమాలోచనలు చేస్తున్నట్లు తెలిసింది.


కందుకూరు: మండల కేంద్రంలోని హెచ్‌పి పెట్రోల్ పంపులో డీజిల్,పెట్రోల్‌కు లైన్‌లో వాహనదారులు


ధారూరులో పెట్రోల్ బంకు వద్ద వేచి ఉన్న వాహనదారులు


బొంరాస్‌పేట్: పెట్రోల్ బంకులో బారులు తీరిన వాహనదారులు

పెట్రోల్, డీజిల్ కోసం ఎగబడిన వాహనదారులు


పరిగిలోని పెట్రోల్ పంపులో కిక్కిరిసిన వాహనదారులు

ధారూరు/మేడ్చల్ టౌన్/కీసర/బొంరాస్‌పేట్/పరిగి, జనవరి 2: ట్యాంకర్ ట్రక్ డ్రైవర్లు సమ్మె చేస్తామని పేర్కొనడంతో పెట్రోల్ బంకులు బంద్ అవుతాయని, డీజిల్, పెట్రోల్ కోసం మంగళవారం రాత్రి బంక్‌ల వద్ద వాహనాలు క్యూకట్టాయి. బంకుల వద్ద వాహనాదారులు ఎగబడ్డారు. జేసీబీలు, ట్రాక్టర్లు, వ్యవసాయ యంత్రాలు, పెద్దవాహనాల వారు ఇంధనం కోసం పెద్ద క్యాన్లతో బంకులకు తరలివచ్చారు. మేడ్చల్‌లో పెట్రోల్ బంకుల వద్ద వాహనాలు బారులు తీరాయి. ద్విచక్ర వాహనదారులు, కొందరు ఖాళీ బాటిళ్లలో బంకుల వద్దకు చేరుకున్నారు. కీసరలో పెట్రోల్ బంక్‌ల వద్ద వాహనదారులు బారులు తీరారు. ట్రాఫిక్ స్తంభించింది. ట్యాంకర్ల యజమానులు సమ్మె విరమించినట్లు ప్రకటించినా వాహనదాదారుల రద్దీ తగ్గలేదు. బొంరాస్‌పేట్ మండలంలో బంకుల వద్ద భారీ లైన్లతో వాహనదారులు ఇబ్బంది పడ్డారు. బొంరాస్‌పేట్, తుంకిమెట్ల గ్రామాల్లో పెట్రోల్ బంకుల వద్ద బారులు తీరారు. పరిగిలోని పెట్రోల్ బంకులు వాహనదారులతో కిక్కిరిశాయి. రాత్రి సమ్మె విరమించారని సమాచారం రావడంతో ఊపిరి పీల్చుకున్నారు.

పెట్రోల్ బంక్‌ల బంద్ వాస్తవం కాదు...

వికారాబాద్:పెట్రోల్ బంకుల బంద్ చేస్తారని జరుగుతున్న ప్రచారం నిజం కాదని అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ స్పష్టం చేశారు. పెట్రోల్ బంకులు యథావిధిగా పనిచేస్తాయని, సోషల్ మీడియా వార్తలను ప్రజలు నమ్మొద్దన్నారు. పెట్రోల్ బంక్ యజమానులు సమ్మెకు దిగుతున్నారని, ఇంధన కొరత ఏర్పడుతుందని, మూడు రోజులు బంకులు బంద్ ఉంటాయనే ప్రచారంలో వాస్తవం లేదని తేల్చి చెప్పారు.

పెట్రోల్ బంకుల వద్ద బారులు తీరిన వాహనాలు


చేవెళ్ల : వాటర్ క్యాన్‌లో పెట్రోల్ నింపుకుంటున్న వాహనదారుడు

ఇబ్రహీంపట్నం/మహేశ్వరం/చేవెళ్ల/కందుకూరు/చౌదరిగూడ, జనవరి 2 : మోటర్ వాహనాల చట్టం సవరణను నిరసిస్తూ తెలంగాణలో పెట్రోల్, ఆయిల్ ట్యాంకర్ల యజమానులు చేపట్టిన ధర్నా నేపథ్యంలో మంగళవారం ఇబ్రహీంపట్నం, చేవెళ్ల, మహేశ్వరం, కందుకూరు, చౌదరిగూడ, షాబాద్, శంకర్‌పల్లి, మొయినాబాద్ తదితర మండలాల పరిధిలోని పెట్రోల్ బంకుల వద్ద వాహనాలు బారులు తీరాయి. సమ్మె మూలంగా పెట్రోల్, డీజిల్ ట్యాంకర్లు కూడా బంద్ కావచ్చని వాట్సాప్ గ్రూపుల్లో పోస్టులు చక్కర్లు కొట్టడంతో ఈ పరిస్థితి ఎదురైంది. బైకులు, కార్లలో చాలా వరకు ఫుల్ ట్యాంక్ చేయించుకున్నారు. పలు బంకుల్లో స్టాక్ అయిపోవడంతో బంకులు మూసుకున్నారు. మరికొన్ని బంకుల్లో నోస్టాక్ బోర్డులు ఏర్పాటు చేశారు. కొందరు వాహనదారులు పెట్రోల్ దొరుకుతుందో లేదోనని ఆదరాబాదరాగా బంకుల వద్దకు వెళ్లారు. కాగా, చేవెళ్ల మండల పరిధిలోని కందవాడ గ్రామం పరిధిలో ఉన్న ఇండియన్ పెట్రోల్ బంకులో కొంత మంది ఐదు లీటర్ల డబ్బాలను తీసుకురాగా.. అదే గ్రామానికి చెందిన ఓ వ్యవసాయ కూలీ ఏకంగా బకెట్‌తో వచ్చి పెట్రోల్ బంకులో వాహనదారులతో పాటు క్యూలైన్‌లో నిల్చున్నాడు. దాంతో వాహనదారులు కడుపుబ్బా నవ్వుకున్నారు. కందుకూరు మండల పరిధిలోని కొత్తగూడ, కొత్తూరు గేటు వద్ద ఉన్న నాలుగు బంకుల్లో పెట్రోల్ కోసం వాహనదారులు, రైతులు తమ ట్రాక్టర్లకు సరిపడా డీజిల్‌ను క్యాన్‌లతో తీసుకెళ్లారు. మంగళవారం సాయంత్రం నుంచి జిల్లేడ్ చౌదరిగూడ మండల కేంద్రంతోపాటు లాల్‌పహడ్‌లోని పెట్రోల్ బంకుల వద్ద వాహనదారులు భారీగా తరలిరావడంతో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మహేశ్వరంలో మంగళవారం రాత్రి పెట్రోలు బంకుల వద్ద వాహనదారులు బారులు తీరారు. సమ్మె లేదని తెలిసినా గంటల తరబడి క్యూలైన్లో ఉండి పెట్రోలు, డీజిల్ పోయించుకున్నారు.

ధర్నా విరమించిన పెట్రోల్, ఆయిల్ ట్యాంకర్ యజమానులు

రంగారెడ్డి అర్బన్ : మోటారు వాహనాల చట్టం సవరణను నిరసిస్తూ తెలంగాణలో పెట్రోల్, ఆయిల్ ట్యాంకర్ల యజమానులు చేపట్టిన ధర్నాను విరమించారు. దాంతో ట్యాంకర్లు యథావిధిగా నడుస్తున్నాయి. మంగళవారం ఉదయం నుంచి ఆయిల్ ట్యాంకర్ల యజమానులు ధర్నాకు దిగడంతో పలు పెట్రోల్ బంకుల వద్ద నో స్టాక్ బోర్డులు పెట్టారు. వాహన దారులు బంకుల వద్ద క్యూ కట్టారు. మరో వైపు పెట్రోల్, డీజిల్ రేట్లను కేంద్రం తగ్గిస్తుందనే భావనలో కొందరు బంకు నిర్వాహకులు పెట్రోల్, డీజిల్ ఫుల్‌స్టాక్ చేయించుకోలేదు. ఈనేపథ్యంలో పెట్రోల్, డీజిల్ అయిపోవడంతో నగర శివారులోని పలుచోట్ల బంకుల వద్ద యజమానులు నో స్టాక్ బోర్డులు పెట్టారు. ఎట్టకేలకు ధర్నాను విరమించడంతో వాహదారులు సంతోషపడ్డారు.

గ్యారంటీల అమలు బాధ్యత మాదే

» స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్

వికారాబాద్, జనవరి 2: అధికారులు ప్రజల వద్దకు వచ్చి పైసాఖర్చు లేకుండా దరఖాస్తులను స్వీకరించి ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారెంటీలకు ఎంపిక చేసేలా చర్యలు తీసుకుంటున్నామని అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. మంగళవారం వికారాబాద్‌లోని 20వ వార్డు రాజీవ్ గృహకల్ప కాలనీలో నిర్వహించిన ప్రజాపాలన సభకు ఆయన హాజరై దరఖాస్తులను స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం గ్యారంటీలను అమలు చేస్తుందన్నారు. అన్ని గ్యారెంటీలకు ఒక్క దరఖాస్తు చేసుకోవచ్చని, రేషన్ కార్డుల కోసం తెల్ల కాగితంపై రాసి ఇవ్వాలన్నారు. అర్హులకు రేషన్ కార్డులు ఇచ్చిన తరువాత మిగతా పథకాలను అమలు చేస్తామన్నారు. తనకు ప్రజలు అప్పగించిన బాధ్యతను సక్రమంగా నిర్వహిస్తానని, రాజీవ్ గృహకల్ప కాలనీలో సమస్యలను పరిష్కరిస్తామన్నారు. ప్రభుత్వ పథకాలు అర్హులందరికీ అందించే పూర్తి బాధ్యత తనదేనన్నారు. వచ్చే ఐదేళ్లలో 24గంటలూ ప్రజలకు అందుబాటులో ఉంటానని, వికారాబాద్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని తెలిపారు. జిల్లాను రూ.3వేల కోట్లతో అభివృద్ధి చేస్తానని, పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీ రోడ్లను బాగుపరిచే చర్యలు చేపడతామన్నారు. ప్రాణహిత-చేవెళ్ల, పాలమూరు-రంగారెడ్డి లిఫ్ట్ పూర్తి చేసేలా కృషిచేస్తానన్నారు. అనంతగిరి కొండలను రూ.200కోట్లతో ఎకో టూరిజంగా అభివృద్ధి చేస్తామన్నారు. కోటిపల్లి ప్రాజెక్టు వద్ద బోటింగ్ సదుపాయం కల్పించి యువతకు ఉపాధి కల్పించామని, వికారాబాద్ ప్రాంతానికి టెక్స్‌టైల్స్ పార్క్ తెచ్చి 4వేల మంది మహిళలకు, పరిశ్రమలను స్థానిక యువతకు ఉపాధి కల్పిస్తామని చెప్పారు. కలెక్టర్ సి.నారాయణరెడ్డి మాట్లాడుతూ.. ప్రతి కుటుంబానికి గ్యారంటీ పథకాలు అందేలా దరఖాస్తును రూపొందించామని, దరఖాస్తులో తప్పులు లేకుండా నింపాలని సూచించారు. ఒక వేళ గ్రామసభలో దరఖాస్తు చేసుకోలేని వారు ఈ నెల ఆరో తేదీ వరకు మునిసిపల్ లేదా పంచాయతీ అధికారులకు దరఖాస్తులు ఇవ్వొచ్చన్నారు. ఇప్పటికే లబ్ధి పొందుతున్న వారు దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మ, మునిసిపల్ చైర్‌పర్సన్ మంజుల, వైస్ చైర్‌పర్సన్ శంషాద్ బేగం, కౌన్సిల్‌లో కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ సుధాకర్‌రెడ్డి, కౌన్సిలర్ మురళి, ఇతర కౌన్సిలర్లు, పాల్గొన్నారు.

ఉపాధి హామీలో అక్రమాలకు పాల్పడితే చర్యలు

దోమ, జనవరి 2: ఉపాధి హామీ పనుల్లో అక్రమాలకు పాల్పడితే చట్టరీత్యా చర్యలు తప్పవని డీఆర్‌డీఏ అడిషనల్ పీడీ స్టీవెన్ నీల్ హెచ్చరించారు. మంగళవారం దోమలో 2022 మార్చి నుంచి డిసెంబరు 2023 వరకు జరిగిన పనులపై 14వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఫీల్డ్ అసిస్టెంట్‌లు, పంచాయతీ కార్యదర్శులు, టెక్నికల్ అసిస్టెంట్‌లు, ఈసీలు, కంప్యూటర్ ఆపరేటర్‌లు బిల్లుల విషయంలో అవకతవకలకు పాల్పడితే జరిమానాలతో పాటు చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. బొంపల్లిలో దోమ బసప్ప, చాకలి భారతమ్మ అనూ కూలీలు చనిపోయినా వారి పేర్లపై రూ.2,400 బిల్లులు చేసినట్లు సామాజిక తనిఖీలో బయటపడింది. పనులు చేయకుండా ఓ వ్యక్తిపై రూ.2,300 బిల్లు చేయగా, మొక్కలకు నీరు పెట్టేందుకు గ్రామ పంచాయతీ ట్రాక్టర్ కాకుండా ప్రైవేట్ వ్యక్తుల ట్రాక్టర్‌ను ఉపయోగించడం, అకౌంట్ నుంచి బిల్లు డ్రా చేయకుండా ఓ వార్డు మెంబర్ అకౌంట్లో వేయడంపై ఎంపీటీసీ రాములు, ఉప సర్పంచ్ రఫీక్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పంచాయతీ కార్యదర్శుల వల్లే అవినీతి జరుగుతోందన్నారు. వారి నుంచి డబ్బులు రికవరీ చేస్తామని అడిషనల్ పీడీ వారికి నచ్చజెప్పారు.

ఎస్‌డీఎఫ్ పనులు చేసి బిల్లులు తెచ్చుకునే బాధ్యత కాంట్రాక్టర్లదే!

తాండూరు, జనవరి 2: తాండూరు నియోజకవర్గానికి మంజూరైన స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్‌ను దారి మళ్లించకుండా మంజూరైన పనులు చేపట్టి వాటి బిల్లులు తెచ్చుకునే బాధ్యత కూడా కాంట్రాక్టర్లకే వదిలేయాలని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి నిర్ణయించినట్లు సమాచారం. తాండూరు అభివృద్ధికి రూ.134కోట్లు గత ప్రభుత్వం మంజూరు చేసింది. వాటిలో కొన్నింటికి జీఓలు వచ్చాయి. కొన్ని అగ్రిమెంట్లు, టెండర్లు పూర్తయ్యాయి. రూ.34కోట్ల విలువైన పనులు పూర్తిచేయగా కొన్ని బిల్లులు వచ్చాయి. మరికొన్ని పెండింగ్ ఉన్నాయి. ఈ జీవోలన్నీ ఉట్టివేనని పలు సభల్లో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి చెప్పగా.. మంజూరైన పనులను రద్దు చేస్తే ఊరుకోం అని మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి అన్నారు. ఈ నేపథ్యంలో ఆ నిధులు, పనుల జోలికి వెళ్లకుండా పనులచేసే నిర్ణయాన్ని మీకే వదిలేస్తున్నానని తనను కలిసిన కాంట్రాక్టర్లతో ఎమ్మెల్యే చెప్పేశారు. మరి పనులు చేస్తే బిల్లులు వస్తాయా? లేదా అన్నది సందేహమే. దీంతో పనులు చేపట్టేందుకు కాంట్రాక్టర్లు సైతం ఆసక్తి చూపడం లేదు.

విద్యార్థుల సంఖ్యకనుగుణంగా బస్సులు నడపాలి


ఆర్టీసీ అధికారులకు వినతి పత్రం ఇస్తున్న ఏబీవీపీ నాయకులు

చేవెళ్ల, జనవరి 2 : విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఆర్టీసీ అధికారులు బస్సులు నడిపించాలని ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బర్ల శ్రీకాంత్ స్పష్టం చేశారు. ఈమేరకు మంగళవారం ఏబీవీపీ నాయకులతో కలిసి చేవెళ్ల ఆర్టీసీ బస్‌స్టాండ్‌లో ఉన్న కంట్రోలర్‌కు వినతి పత్రం అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన ప్రభుత్వం మహిళల కోసం కేటాయించిన ఉచిత బస్సులతో సామాన్య ప్రజలు, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. చేవెళ్ల ప్రాంతానికి నిత్యం వేలాది మంది విద్యార్థులు వివిధ గ్రామాల నుంచి చదువుకోవడానికి వస్తుంటారని చెప్పారు. విద్యార్థుల బస్‌పాసులకు డబ్బులు చెల్లించినప్పటికీ వారి సంఖ్యకు అనుగుణంగా అధికారులు బస్సులు నడపడం లేదన్నారు. విద్యార్థులు సాయంత్రం నుంచి రాత్రి వరకు బస్సుల కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి చేవెళ్లకు ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేక బస్సులు నడిపించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో చేవెళ్ల నగర కార్యదర్శి మహిపాల్, నాయకులు ఉదయ్, సాయి, అరవింద్ తదితరులు ఉన్నారు.

ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యం


దరఖాస్తు స్వీకరణ కేంద్రాలను సందర్శిస్తున్న అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి

మూడుచింతలపల్లి, జనవరి 2: అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యం అని మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి అన్నారు. మంగళవారం కొల్తూర్, నారాయణపూర్ గ్రామాల్లో ప్రజాపాలన దరఖాస్తులు స్వీకరణకు సుధీర్‌రెడ్డి, నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి వజ్రేష్‌యాదవ్, అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి సందర్శించారు. వారు మాట్లాడుతూ.. మెరుగైన పాలనలో భాగంగానే ప్రజాపాలనకు శ్రీకారం చుట్టారన్నారు. ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో వత్సలాదేవి, తహసీల్దార్ వాణిరెడ్డి, ఎంపీవో సునీత, వైస్ ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచ్‌లు శిల్పాయాదగిరి, రాంచంద్రయ్య, ఎంపీటీసీ అఖిలేష్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు నర్సింహులు, విష్ణుగౌడ్, నవీన్‌చారి, కార్యకర్తలు పాల్గొన్నారు.


మండల కేంద్రంలోని ఆధార్ సెంటర్‌కు చేరుకున్న జనం

'ఆధార్' అప్‌డేట్‌కు జనం తంటాలు

యాచారం, జనవరి 2 : ప్రజాపాలన కార్యక్రమం సందర్భంగా ఆధార్ కార్డు అప్‌డేట్ చేసుకొని దరఖాస్తు చేసుకోవాలని మండలంలో జోరుగా ప్రచారం సాగుతుండటంతో జనం ఆధార్ కేంద్రాలకు పరుగులు తీస్తున్నారు. ఉదయం 8గంటల కల్లా యాచారం మండలంలోని వివిధ గ్రామాల జనంతో పాటు కందుకూరు, మంచాల, నల్గొండ జిల్లా మర్రిగూడ, చింతపల్లి మండలాలకు చెందిన గ్రామాల ప్రజలు యాచారంలోని ఆధార్ సెంటర్లకు చేరుకుంటున్నారు. మంగళవారం ఉదయం గంటలకే దాదాపు 150 మంది ఆధార్ కేంద్రాలకు చేరుకొని క్యూలో నిల్చోవడం కనిపించింది. మండల కేంద్రంలోని రెండు సెంటర్ల ముందు జనం గంటల కొద్దీ క్యూలో నిల్చొని మరీ ఆధార్ కార్డులు అప్‌డేట్ చేసుకుంటున్నారు. కాగా, ఒక్కో సెంటర్‌లో రోజుకు 40 నుంచి 50 మంది కార్డులను అప్‌డేట్ చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

2కేఎస్‌పీటీ2: ఎమ్మెల్యే శంకర్, మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ రెడ్డిలకు పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలుపుతున్న విశాలాశ్రవణ్‌రెడ్డి


ఎమ్మెల్యే శంకర్ పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలుపుతున్న విశాలా శ్రవణ్‌రెడ్డి

కేశంపేట అభివృద్ధికి సహకరిచాలి

» ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు జడ్పీటీసీ వినతి

కేశంపేట, జనవరి 2: కేశంపేట మండలంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించి అభివృద్ధికి సహకరించాలని స్త్రీ, శిశు సంక్షేమ శాఖ జిల్లా స్టాడింగ్ కమిటీ చైర్‌పర్సన్, కేశంపేట జడ్పీటీసీ తాండ్ర విశాలాశ్రవణ్‌రెడ్డి దంపతులు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ను కోరారు. మంగళవారం షాద్‌నగర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డి, కొత్తూర్ మాజీ జడ్పీటీసీ శ్యాంసుందర్ రెడ్డిలను కలిసి పుష్పగుచ్ఛం అందించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కేశంపేట మండల అభివృద్ధికి సహకరించాలని జడ్పీటీసీ ఎమ్మెల్యేను కోరారు.

పేదల సంక్షేమమే ధ్యేయం

● షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్
● 'అభయహస్తం' దరఖాస్తుల స్వీకరణ


ఇబ్రహీంపట్నం : చెర్లపటేల్‌గూడ గ్రామ సభలో పాల్గొన్న తహసీల్దార్ అన్వర్, తదితరులు

చౌదరిగూడ, జనవరి 2: బడుగు, బలహీన వర్గాలకు చెందిన పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మంగళవారం జిల్లేడ్ చౌదరిగూడ మండల పరిధిలోని పీర్జాపూర్‌లో సర్పంచ్ సత్యమ్మ అధ్యక్షతన నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదు గ్యారెంటీ పథకాల కోసం నిరుపేద ప్రజలు ఏ నాయకుడికి, అధికారులకు మస్కా కొట్టాల్సిన పనిలేదని అన్నారు. ఆర్డీవో వెంకట మాధవరావు, మాజీ ఎమ్మెల్యే ప్రతాప్


మంచాల : చెన్నారెడ్డిగూడ గ్రామసభలో మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీనివాస్

రెడ్డి, అధికారులు తహసీల్దార్ విజయ్‌కుమార్, ఎంపీవో విజయ్‌కుమార్, ఏపీఎం రామస్వామి, సర్పంచులు బాల్‌రాజ్, గోపాల్ ఎంపీటీసీలు సత్యనారాయణరెడ్డి, రజిత, మాజీ జడ్పీటీసీ శ్యాంసుందర్ రెడ్డి, మండలాధ్యక్షుడు రాజు, కృష్ణారెడ్డి, చంద్రశేఖర్, నరేందర్, పాపయ్య, యాదయ్య, మల్ల య్య, శేఖర్, వెంకట్‌రాములు, వ రవికుమార్ చందునాయక్, మోహన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అధికారం ఇచ్చిన ప్రజలకు అండగా నిలుస్తాం

కొత్తూర్ : కాంగ్రెస్ పార్టీకి అధికారం ఇచ్చిన ప్రజలకు అండగా ఉంటూ సంక్షేమ ఫలాలు అందిస్తామని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మండల పరిధిలోని గూడూర్‌లో నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరై అభయహస్తం దరఖాస్తులు స్వీకరించారు. ఎంపీపీ మధుసూదన్‌రెడ్డి, ఎంపీడీవో శరత్‌చంద్రబాబు, షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ శ్యాంసుందర్ రెడ్డి, సర్పంచులు సత్తయ్య, ప్రభాకర్, సాయిలు, రవి నాయక్, ఉపసర్పంచ్ దయానంద్‌గుప్త, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు హరినాథ్‌రెడ్డి, నాయకులు బాల్‌శౌరిరెడ్డి, జె.సుదర్శన్‌గౌడ్, దర్శన్, రాందాస్‌నాయక్, పద్మారావు తదతరులు పాల్గొన్నారు.

పథకాలను సద్వినియోగించుకోవాలి


శంషాబాద్‌రూరల్ : ఘన్సీమియాగూడలో దరఖాస్తులు స్వీకరిస్తున్న తహసీల్దార్ నాగమణి

కేశంపేట : ప్రజలు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కేశంపేట తహసీల్దార్ మీర్ అజాంఅలీ, ఎంపీడీవో రవిచంద్రకుమార్ రెడ్డిలు సూచించారు. మండల పరిధిలోని సుందరాపురంలో తహసీల్దార్, బైర్కాన్‌పల్లిలో ఎంపీడీవో ప్రజాపాలనను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో వారు మాట్లాడుతూ నూతన ప్రభుత్వ ప్రజాపాలనలో ఐదు గ్యారంటీలకు దరఖాస్తులు తీసుకుంటుందని తెలిపారు. గతంలో పింఛన్, రైతుబంధు వస్తే ఆ పథకాలకు కాకుండా అర్హులు మిగతా పథకాలకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. దరఖాస్తు ఎలా చేసుకోవాలో సుందరాపురం ఉప సర్పంచ్ యారం భాస్కర్ రెడ్డి వివరించారు. కార్యక్రమాలలో సర్పంచ్‌లు రాములు నాయక్, కృష్ణయ్య, మాజీ సర్పంచ్‌లు రాఘవేందర్ రావు, రూప్లానాయక్, యాదగిరి చారి, అంజయ్య తదితరులున్నారు.


చౌదరిగూడ : పీర్జాపూర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్


యాచారం : మాల్‌లో ప్రజాపాలన కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న అదనపు డీసీపీ శ్రీనివాస్

'ప్రజాపాలన' శాంతియుతంగా చేపట్టాలి

యాచారం : ప్రజాపాలన కార్యక్రమాలను శాంతియుతంగా చేపట్టాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు చొరవ తీసుకోవడం అభినందనీయమని మహేశ్వరం అదనపు డీసీపీ శ్రీనివాస్ అన్నారు. మంగళవారం మండలంలోని మాల్‌లో నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ప్రజల నుంచి అధికారులు ఫిర్యాదులు తీసుకోవడంతో పాటు దరఖాస్తు ఫారాలను పరిశీలన చేసి పలు సూచనలు చేయడం ప్రశంసనీయమన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో ప్రజాపాలన కార్యక్రమ నిర్వాహణ తీరును వివిధ శాఖల అధికారులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో విజయలక్ష్మి, తహసీల్దార్ శ్రీకాంత్‌రెడ్డి, ఎంపీవో ఉమారాణి, సర్పంచ్ పడకంటి కవిత, కాలె సంతోష తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ పథకాలు

ఇబ్రహీంపట్నం, జనవరి 2: అర్హులైన ప్రతీ ఒక్కరికి సంక్షేమ పథకాలు అందేట్లు చూస్తామని ఇబ్రహీంపట్నం తహసీల్దార్ ఎండీ అన్వర్ తెలిపారు. మండలంలోని చెర్లపటేల్‌గూడలో జరిగిన గ్రామ సభలో ఆయన పాల్గొన్నారు. ప్రజాపాలన దరఖాస్తులో బ్యాంకు అకౌంట్ వివరాలు అడగలేదని పలువురు తహసీల్దార్ దృష్టికి తీసుకువచ్చారు. విచారణ అనంతరం అర్హులనుంచి బ్యాంకు అకౌంట్ వివరాలు తీసుకుంటామన్నారు. ఇంటి యజమానిగా భార్య లేదా భర్త ఎవరి పేరుపై అయినా దరఖాస్తు చేసుకోవచ్చని అన్నారు. దరఖాస్తులో అడిగిన వివరాలను ఒకటికి రెండుసార్లు చూసుకుని రాయాలన్నారు. సర్పంచ్ కంభాలపల్లి గీతారాంరెడ్డి, ఎంపీటీసీ ఆంజనేయులు, ఉప సర్పంచ్ నరేందర్ తదితరులు పాల్గొన్నారు. కాగా ఉప్పరిగూడ గ్రామ సభలో ఎంపీడీవో వెంకటమ్మ, కర్నంగూడలో జరిగిన గ్రామ సభలో ఎంపీవో లక్పతినాయక్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

షాబాద్ : అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందుతాయని షాబాద్ తహసీల్దార్ చిన్నప్పలనాయుడు అన్నారు. పోతుగల్ గ్రామంలో ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా ఎంపీడీవో అనురాధతో కలిసి దరఖాస్తులు స్వీకరించారు. సర్పంచ్ ఇస్మత్‌బేగం, నాయకులు పామెన నర్సింహులు, అయూబ్, అశ్వక్‌అలీ, పంచాయితీ కార్యదర్శి అశోక్ తదితరులున్నారు.

ప్రతీఒక్కరికీ పథకాల వర్తింపు

మంచాల/కొందుర్గు : అర్హులైన పేదలందరికీ సంక్షేమ పథకాలు అందేట్లు చూస్తామని మంచాల ఎంపీడీవో శ్రీనివాస్ అన్నారు. మండల పరిధిలోని చెన్నారెడ్డిగూడ, బండలేమూర్, తిప్పాయిగూడ గ్రామాల్లో మంగళవారం అభయహస్తం ప్రజాపాలనలో భాగంగా దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం ప్రారంభించారు. ఈసందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ దరఖాస్తు ఫారాలను ఇంటింటికీ పంపిణీ చేస్తామన్నారు. సర్పంచ్‌లు కిషన్‌నాయక్, పాత్‌లోత్ మంగ్రీనివాస్, సీహెచ్ పాండు, ఎంపీటీసీలు పి.సుకన్య, మధుసూదన్‌రెడ్డి, పరంగా తదితరులున్నారు. అదేవిధంగా కొందుర్గు మండలం భైరంపల్లి, ఉత్తరాస్‌పల్లి, తంగళ్లపల్లి, వెంకిర్యాలలో గ్రామ సభలు నిర్వహించారు. 1356మంది దరఖాస్తులు అందజేశారు. ఎంపీడీవో అంజనేయులు, తహసీల్దార్ రమేష్ కుమార్, సర్పంచులు లింగమయ్య గౌడ్, కె.బాల్‌రాజ్, ఆంజనేయలు, నాయకుడు కృష్ణారెడ్డి పాల్గొన్నారు.


షాబాద్ : పోతుగల్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్న తహసీల్దార్ చిన్నప్పలనాయుడు

'అభయహస్తం' కోసం దరఖాస్తు చేసుకోవాలి

ఆమనగల్లు : అభయ హస్తం ఆరు గ్యారంటీ పథకాలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్‌లు ఎగిరిశెట్టి గోదాదేవి సత్యం, ప్రేమలత, ఎంపీడీవో పారుఖ్‌హుస్సేన్‌లు కోరారు. ఆమనగల్లు మండలం శెట్టిపల్లి, సింగంపల్లి గ్రామాల్లో దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. సర్పంచ్‌లు గోదాదేవి, ప్రేమలతల అధ్యక్షతన నిర్వహించిన గ్రామ సభల్లో మండలంలోని అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు. ఎంపీవో శ్రీలత, ఏఈలు సీతారామ్, రవితేజ, కృష్ణయ్య, ఏవో అరుణకుమారి, ఉప సర్పంచ్ వెంకటయ్య, తదితరులున్నారు. కడ్తాల మండలం కర్కల్‌పహాడ్, నార్లకుంట తండా, వాసుదేవ్ పూర్, బాలాజీ నగర్ తండా లలో ప్రజా పాలన గ్రామ సభలు నిర్వహించి దరఖాస్తులు స్వీకరించారు. సర్పంచ్‌లు నాగమణివెంకోబా, కమ్లీబీచ్యనాయక్, పూజ, ఎంపీటీసీ లచ్చిరామ్ నాయక్, ఎంపీడీవో రామకృష్ణ, తహసీల్దార్ ముంతాజ్, ఏఈ లు నరేందర్, పరమేశ్, ఏవో శ్రీలత , వివిద శాఖల అధికారులు తదితరులున్నారు. తలకొండపల్లి మండలం చీపునుంతల, వెంకటాపూర్ తండా, జూలపల్లి, ఫూల్ సింగ్ తండా, వెంకట్రావ్‌పేట, గడ్డమీది తండాలలో గ్రామ సభలు ఏర్పాటు చేసి అధికారులు దరఖాస్తులు స్వీకరించారు. ఎంపీడీవో శ్రీకాంత్, సర్పంచ్‌లు రఘుపతి, చంద్రయ్య, ఈశ్వర్, హైమావతి,అలివేలమ్మ, లలిత, జగ్గి, తదితరులు పాల్గొన్నారు.


కడ్తాల్ : ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న ఎంపీడీవో రామకృష్ణ

అర్హుందరికీ ప్రభుత్వ పథకాల వర్తింపు

శంషాబాద్‌రూరల్ : అర్హులైన ప్రతీ ఒక్కరికి ప్రభుత్వ పథకాలు అందుతాయని శంషాబాద్ తహసీల్దార్ నాగమణి అన్నారు. ప్రజా పాలనతో భాగంగా ఘన్సీమియాగూడ, మదన్‌పల్లిలో జరిగిన ప్రజా పాలన కార్యక్రమంలో పాల్గొన్నారు. సర్పంచులు దేవికజగన్‌గౌడ్, దేవానాయక్, పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.


ఆమనగల్లు : శెట్టిపల్లిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న సర్పంచ్ గోదాదేవిసత్యం, ఎంపీడీవో పారుఖ్‌హుస్సేన్

క్రైం కార్నర్

బైక్ అదుపుతప్పి కిందపడి
యువకుడి దుర్మరణం

ఆదిభట్ల, జనవరి 2 : బైక్ అదుపుతప్పి కిందపడి తలకు గాయాలై ఓయువకుడు అక్కడికక్కడే మృతిచెందగా మరో యువకుడు గాయాలపాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈఘటన ఆదిభట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో బొంగ్లూరు ఔటర్ జంక్షన్ వద్ద సాగర్ రహదారిపై మంగళవారం సాయంత్రం చోటు చేసుకుంది. ఆదిభట్ల ఎస్‌ఐ శ్రీనివాస్ రావు తెలిపిన వివరాల ప్రకారం.. తమిళనాడుకు చెందిన గోమతి నయగాం, షణ్ముఖ సుందరంలు మన్నెగూడ వద్ద గల పెట్రోల్ పంపులో పనిచేస్తున్నారు. కాగా, మంగళవారం సాయంత్రం 3.35 గంటల సమయంలో భోజనం చేయడానికి పల్సర్ బైకుపై బొంగ్లూరుకు వచ్చారు. భోజనం చేసి తిరిగి వెళ్తుండగా బైకు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టారు. దాంతో బైకు నడుపుతున్న గోమతి నయగాం(21)కు తీవ్రగాయాలయ్యాయి. వెనకాల కూర్చున్న షణ్ముఖ సుందరం(25) ఒక్కసారిగా ఎగిరి కిందపడడంతో తలకు బలమైన గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. ఈమేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో ఒగ్గు కళాకారుడు మృతి


శివకుమార్ (ఫైల్)

షాబాద్, జనవరి 2 : విద్యుదాఘాతంతో ఒగ్గు కళాకారుడు మృతి చెందిన ఘటన షాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని చందన్‌వెళ్లి గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ మహేశ్వర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మొయినాబాద్ మండలం పెద్దమంగళారం గ్రామానికి చెందిన ఒగ్గు కళాకారుడు శివకుమార్(50) షాబాద్ మండల పరిధిలోని చందన్‌వెళ్లి గ్రామానికి చెందిన కందివనం మల్లేష్‌గౌడ్ తన ఇంటి వద్ద ఎల్లమ్మ కల్యాణం నిర్వహించారు. శివకుమార్ తన బృందంతో మైక్‌తో కథ చెప్పేందుకు మౌత్‌పీసు తీసుకోగానే ఒక్కసారిగా విద్యుత్‌షాక్ రావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మరో వ్యక్తి స్వల్పగాయాలతో బయ టపడ్డాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ యువకుడు..

షాద్‌నగర్ రూరల్, జనవరి 2 : రైలు ప్రమాదంలో గాయపడిన యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందినట్లు రైల్వే హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్ తెలిపారు. పట్టణంలోని సిమ్లా కాలనీకి చెందిన అబుబాకర్(17) ఈ నెల ఒకటిన సాయంత్రం 5.00 గంటల ప్రాంతంలో సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ కీర్తి వెంచర్ సమీపంలో రైలు పట్టాలపై నడుచుకుంటూ వెళ్తుండగా మహబూబ్‌నగర్ నుంచి మీర్జాపల్లి వెళ్లే ప్యాసింజర్ రైలు ఢీకొంది. తీవ్రంగా గాయపడిన అతడిని చికిత్స నిమిత్తం షాద్‌నగర్ కమ్యూనిటీ ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స అనంతరం శంషాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అదే రాత్రి (సోమవారం) మృతిచెందాడు. అతడి తండ్రి అక్బర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లుహెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

ప్రజాపాలనలో అన్ని వర్గాలకు మేలు


ఎమ్మెల్యే కసిరెడ్డిని సన్మానిస్తున్న గుర్రం కేశవులు, నాయకులు

ఆమనగల్లు, జనవరి 2: రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని పరిపుష్టం చేసేదిశగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తుందని, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి అన్నారు. మెరుగైన పాలనే ధ్యేయంగా ప్రజా పాలనలో అన్ని వర్గాలకు మేలు జరిగేలా అనేక సంస్కరణలు తీసుకువస్తుందన్నారు. కల్వకుర్తి నియోజకవర్గంలోని కడ్తాల, ఆమనగల్లు, కల్వకుర్తి మండలాల్లో మంగళవారం ఎమ్మెల్యే కసిరెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా శిలారుపల్లిలో వార్డు సభ్యురాలు విజయలక్ష్మి సమకూర్చిన సైకిళ్లను విద్యార్థినులకు పంపిణీ చేశారు. తలకొండపల్లి మండలం కర్కస్ తండాకు చెందిన మాజీ సర్పంచ్ శంకర్ నాయక్ ఆధ్వర్యంలో రూపొందించిన 2024 నూతన సంవత్సరం క్యాలెండర్ ను ఆవిష్కరించారు. ఆమనగల్లు మాజీ మార్కెట్ వైస్ చైర్మన్ గుర్రం కేశవులు ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కసిరెడ్డి ని పూలమాలలు, శాలువాలతో సత్కరించి అభినందించారు. పలు అభివృద్ధి కార్యక్రమాల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర సంపదను పెంచి వివిధ పథకాల ద్వారా ప్రజలకు పంచడమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమన్నారు. ప్రజా పాలనలో అన్ని వర్గాలకు మేలు జరుగుతుందని చెప్పారు. కాంగ్రెస్ ప్రకటించిన పథకాలకు అభయ హస్తం గ్రామ సభల్లో ఈనెల 6 వరకు అర్హులైన పేదలు దరఖాస్తులు చేసుకోవాలని నారాయణరెడ్డి కోరారు. ప్రజలు కోరుకున్న విధంగా రాష్ట్ర ప్రభుత్వం పాలన అందిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు యాట నర్సింహ, బ్యంగి ఆనంద్ కుమార్, గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, నరేందర్, గుర్రం కేశవులు, సురేందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలను వినియోగించుకోవాలి


మాట్లాడుతున్న శ్రీవర్ధన్ రెడ్డి

కేశంపేట, జనవరి 2: కేంద్రం ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎన్. శ్రీవర్ధన్ రెడ్డి సూచించారు. మండల పరిధిలోని ఇప్పలపల్లి, పోమాల్ పల్లి గ్రామాలలో మంగళవారం వికసిత్ భారత్ సంకల్ప్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వ ప్రజల కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని వివరించారు. విశ్వకర్మ పథకంలో వృత్తి పనులు చేసుకునే వారికి బ్యాంకు ద్వార రుణాలు ఇస్తున్నామని తెలిపారు. చివరి వ్యక్తి పథకాలు చేరడమే బీజేపీ ప్రభుత్వ లక్ష్యమని వివరించారు. ప్రధానమంత్రి నరేంద్రమోడి 18 గంటలు ప్రజల కోసం పనిచేస్తున్నరని వివరించారు. కేంద్రం అములు చేస్తున్న పథకాలు ప్రజలకు తెలపాలనే ఉద్దేశ్యంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నమని ఆయన తెలిపారు. ఆయా కార్యక్రమాలలో సర్పంచ్‌లు అంజనేయులు, కృష్ణయ్య, ఉప సర్పంచ్ అనుమగళ్ల రమేష్, కిసాన్‌మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు మోటే శ్రీనివాస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పీఏసీఎస్ చైర్మన్ దామోదర్‌రెడ్డి రాజీనామా


మాట్లాడుతున్న దామోదర్‌రెడ్డి

కొందుర్గు, జనవరి 2: బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన కొందుర్గు ఉమ్మడి మండలాల పీఏసీఎస్ చైర్మన్ చిట్టెం దామోదర్‌రెడ్డి మంగళవారం తన పదవికి రాజీనామా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్‌కు షాద్‌నగర్ నియోజవర్గంలో సరైన నాయకత్వం లేదని, అహంకార ధోరణి ఎక్కువగా ఉందని, పార్టీలో కార్యకర్తలకు, నాయకులకు తగిన స్వేచ్ఛ లేదని, విలువ ఇవ్వడం లేదని అన్నారు. పార్టీకి రాష్ట్రంలో భవిష్యత్తు లేదని, త్వరలోనే బీఆర్‌ఎస్ కనుమరుగు కానుందన్నారు. కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలకు ప్రజలు ఆకర్షితులై ఆ పార్టీకి అధికారం ఇచ్చారని అన్నారు. అనుచరులు, కార్యకర్తలతో మాట్లాడి, భవిష్యత్తు నిర్ణయం తీసుకుంటాన న్నారు. కాగా, త్వరలోనే దామోదర్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరనున్నట్లు సమాచారం.

చేవెళ్ల ట్రాఫిక్ ఎస్సై విఠల్‌రెడ్డికి సేవాపతకం

చేవెళ్ల, జనవరి 2 : విధినిర్వహణలో ఉత్తమ పనితీరు కనబర్చిన చేవెళ్ల ట్రాఫిక్ పోలీస్ సబ్ ఇన్‌స్పెక్టర్ గజ్జల విఠల్‌రెడ్డిను పోలీస్ సేవా పతకం వరించింది. రాష్ట్ర ప్రభుత్వం నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని పతకాలను ప్రకటించిన విషయం తెలిసిందే. ఇందులో బాగంగా ప్రభుత్వం ప్రకటించిన సేవాపతకానికి చేవెళ్ల ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో ఎస్సైగా విధులు నిర్వర్తిస్తున్న విఠల్‌రెడ్డిని సేవాపతకం వరించింది. ఆయనకు సేవాపతకం రావడంతో చేవెళ్ల ట్రాఫిక్ పోలీస్ అధికారులు, సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

కొత్తూర్ ఇన్‌స్పెక్టర్ బదిలీ

● నూతన ఇన్‌స్పెక్టర్‌గా నర్సింహారావు


నర్సింహారావు

కొత్తూర్, జనవరి 2: కొత్తూర్ ఇన్‌స్పెక్టర్ కోరం శంకర్‌రెడ్డి బదిలీ అయ్యారు. కోడ్ కారణంగా ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల ముందు కొత్తూర్ పోలీస్‌స్టేషన్‌కు ఇన్‌స్పెక్టర్‌గా వచ్చిన శంకర్‌రెడ్డి అతి తక్కువ కాలంలోనే బదిలీ అయ్యారు. కాగా, ఆయన కొన్ని రోజులే పని చేసినప్పటికీ మండల ప్రజలు మన్ననలు పొందారు. శంకర్‌రెడ్డి ఇక్కడి నుంచి సైబరాబాద్ కమిషనరేట్ కౌంటర్ నార్కోటిక్స్‌కు బదిలీ అయ్యారు. కూకట్‌పల్లి ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌వోగా పనిచేస్తున్న వి. నర్సింహారావు కొత్తూర్‌కు బదిలీపై వస్తున్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

యాచారం, జనవరి 2 : మండలంలోని గడ్డమల్లాయాగూడ ఫీడర్ పరిధిలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ సందీప్‌కుమార్ తెలిపారు. 11కేవీ, ఎల్టీ లైన్ల కింద ఉన్న చెట్ల నరికివేత పనుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన తెలిపారు.

మొక్కజొన్న సాగులో మెలకువలు పాటించాలి

కొందుర్గు, జనవరి 2 : రైతులు మొక్కజొన్న సాగులో మెలకువలు పాటించాలని మండల వ్యవసాయాధికారి మధుసూదన్ అన్నారు. మండల పరిధిలోని భైరంపల్లిలో మొక్కజొన్న పంటను మంగళవారం ఆయన పరిశీలించారు. హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్‌లో గల వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు ఇటీవల ఉచితంగా మొక్కజొన్న విత్తనాలు అందజేశారు. ఈమేరకు వ్యవసాయాధికారి మధుసూదన్ భైరంపల్లి గ్రామానికి చెందిన పెద్దింటి ప్రభాకర్ ఎకరా భూమిలో సాగు చేసిన మొక్కజొన్నను పరిశీలించారు.


రైతుకు సూచనలిస్తున్న అధికారి మధుసూదన్

'అయోధ్య' అక్షింతల వితరణ


చేవెళ్ల : కౌకుంట్ల గ్రామంలో అక్షింతలకు పూజలు చేస్తున్న ప్రజాప్రతినిధులు, నాయకులు


మంచాల : జాపాలలో అక్షింతలకు పూజలు చేసి తీసుకెళుత్తున్న భక్తులు

చేవెళ్ల/ఆమనగల్లు/మంచాల, జనవరి 2 : శ్రీరామ జన్మభూమి(అయోధ్య) అక్షింతల వితరణ కార్యక్రమం చేవెళ్ల మండల పరిధిలోని కౌకుంట్ల గ్రామంలో మంగళవారం నిర్వహించారు. రామజన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్టు పిలుపు మేరకు ఆర్‌ఎస్‌ఎస్, విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో శ్రీరామ జన్మభూమి అక్షింతల కలశ వితరణ కార్యక్రమం గ్రామంలోని హనుమాన్ దేవాలయంలో డీసీఎంఎస్ చైర్మన్ పి. కృష్ణారెడ్డి సమక్షంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీరామ జన్మభూమి అక్షింతలను గడపగడపకూ తీసుకెళ్లాలని సూచించారు. సర్పంచ్ గాయత్రి, మాజీ ఉప సర్పంచ్ మల్లారెడ్డి, బీఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నాయకులు నాగార్జున్‌రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ వేంకటేశ్వర్ రెడ్డి, గ్రామస్తులు, భక్తులు తదితరులు ఉన్నారు. అదేవిధంగా ఆమనగల్లు పట్టణంలోని 15వ వార్డు శివాలయ నగర్ కాలనీలో మంగళవారం ఇంటింటికీ అయోధ్య అంక్షింతల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. వార్డు కౌన్సిలర్ చెక్కాల లక్ష్మణ్ ఆధ్వర్యంలో అంక్షింతలతో కాలనీలలో ర్యాలీ నిర్వహించారు. శ్రీరామ నామ జపం చేస్తూ ఇంటింటికీ అంక్షింతలను పంపిణీ చేశారు. ప్రధాని మోదీ నాయకత్వంలో అయోధ్యలో రామాలయం నిర్మించడం దేశానికి గర్వకారణమన్నారు. కార్యక్రమంలో దొంతు సత్యనారాయణ, నారాయణ గౌడ్, కోట్ల వెంకటేశ్, చలిచీమల పెంటయ్య, మనోహర్ తదితరులు పాల్గొన్నారు. మంచాల మండలంలో అయోధ్య సీతారాముల వారి అక్షింతల వితరణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆరుట్ల, జాపాల గ్రామాల్లో శ్రీరాములోరి అక్షింతలకు స్థానిక దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి వాయిద్యాలతో ఊరేగించారు. జాపాలలో జరిగిన కార్యక్రమంలో సంగెం కృష్ణ, చంద్రకాంత్, కృష్ణ, పరమేష్, సైదులు, శ్రీశైలం, సతీష్, ఆరుట్లలో ఉపసర్పంచ్ పాండాలజంగయ్య, దండుమధుసూదన్‌రెడ్డి తదితరులున్నారు.

ఏఐసీసీ కార్యదర్శి వంశీకి సన్మానం

ఆమనగల్లు, జనవరి 2:ఏఐసీసీ కార్యదర్శి, సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు, కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే చల్లా వంశీచంద్ రెడ్డిని మంగళవారం కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. మిడ్జిల్ మండలంలో వివిధ కార్యక్రమాలలో పాల్గొనడానికి వెళ్తున్న వంశీని కలిసి పూలమాలలు, శాలువాలతో సత్కరించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. వంశీని సన్మానించిన వారిలో టీపీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, ఆమనగల్లు మాజీ జడ్పీటీసీ శ్రీపాతి శ్రీనివాస్ రెడ్డి, ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు భగవాన్ రెడ్డి, నాయకులు అజీం, జనార్ధన్, ఆరీప్, తదితరులు ఉన్నారు.



క్యాలెండర్ ఆవిష్కరించిన ఎంపీ



ఆమనగల్లు, జనవరి 2 : ప్రముఖ న్యాయ వాది అండెకార్ యాదిలాల్ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సరం- 2024 క్యాలెండర్‌ను నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యుడు పోతుగంటి రాములు ఆవిష్కరించారు. హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో ఆవిష్కరించి ప్రజలకు అందజేశారు. ప్రతీయేటా క్యాలెండర్లను రూపొందించడంతో పాటు చట్టాలు, న్యాయ వ్యవస్థపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న యాదిలాల్‌ను ఎంపీ అభినందించారు. టీడీపీ రాష్ట్ర నాయకుడు అర్థం నర్సింహ, నాయకులు ఎన్టీ పంచాక్షరి, మంద రాంరెడ్డి, తిప్పిరెడ్డి నారాయణ రెడ్డి, రాజిరెడ్డి, తదితరులున్నారు.

సంక్షిప్తంగా..

షాబాద్ : ప్రభుత్వం లెక్చరర్ల సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ లెక్చరర్స్ ఫోరం చైర్మన్ కత్తి వెంకటస్వామి అన్నారు. మంగళవారం నగరంలోని ఆయన నివాసంలో తెలంగాణ లెక్చరర్స్ ఫోరం జిల్లా అధ్యక్షుడు గంగపురం ఆంజనేయులుగౌడ్ ఆయన్ను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు. ఆయన మాట్లాడుతూ లెక్చరర్లు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకుపోవాని కోరినట్లు తెలిపారు.

● **ఆమనగల్లు** : సీఎం రేవంత్‌రెడ్డిని రేవంత్ మిత్ర మండలి రాష్ట్ర అధ్యక్షుడు ఆసిఫ్‌అలీ మర్యాదపూర్వకంగా కలిశారు. సచివాలయంలో సీఎంను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

● **ఆమనగల్లు** : జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, ప్రముఖ సంఘ సేవకుడు లిక్కి అనురుద్రారెడ్డి గవర్నర్ తమిళిసైని మర్యాదపూర్వకంగా కలిశారు. పలువురు ఉద్యోగులతో గవర్నర్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

● **నందిగామ** : అయ్యప్పలకు అన్నదానం చేయడం అదృష్టంగా ఉందని పీఏసీఎస్ చైర్మన్ రాజగోపాల్ అన్నారు. మంగళవారం మండలకేంద్రంలోని అయ్యప్ప దేవాలయంలో అయ్యప్పలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అంతకు ముందు వారు దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. దేవాలయకమిటీ సభ్యులు చైర్మన్ దంపతులను ఘనంగా సన్మానించారు.

కనుల పండువగా మల్లికార్జున స్వామి కల్యాణం


పూజా కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే యాదయ్య

శంకర్‌పల్లి/చేవెళ్ల, జనవరి 2 : శంకర్‌పల్లి మున్సిపాల్ కేంద్రంలో మంగళవారం నిర్వహించిన శ్రీ గొల్లకేతమ్మ-భ్రమరాంభ మల్లికార్జున స్వామి, బీరప్ప కామరాతి స్వాముల కల్యాణ మహోత్సవం కనుల పండువగా నిర్వహించారు. ఈ మహోత్సవ వేడుకల్లో చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య, ప్రజాప్రతినిధులతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. అంతకుముందు మహిళలు బోనాలు సమర్పించారు. దారిపొడవునా శివసత్తుల పూనకాలు, డప్పుచప్పుళ్లతో ఆ ప్రాంతం మార్మోగింది. ప్రజాప్రతినిధులు, నాయకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

గురుకుల ప్రవేశపరీక్షకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ

యాచారం, జనవరి 2 : సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో 5వ తరగతిలో ప్రవేశ పరీక్షకు ఈనెల 6వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని గురుకుల సాంఘిక సంక్షేమ పాఠశాల ప్రిన్సిపల్ కె.యాదయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు యాచారంలో ఆయన పరీక్షకు సంబంధించిన పోస్టర్ విడుదల చేశారు. కాగా, మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాల వద్ద, గ్రామపంచాయతీలకు పోస్టర్లను పంపించామని తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు విధిగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.